


చాలా సంవత్సరాల కిందటి సంగతి. ఆ రోజుల్లో, గంగా తీరంలో ఒక శివాలయం ఉండేది. ఎవరో మహారాజు ఆ దేవాలయానికి చాలా భూములను దానం చేశారు. ఆ భూముల మీద ఏటా వేలాది రూపాయల ఆదాయం వచ్చేది. అంతదాకా ఎవ్వరూ కాలుమోపని ఆ ప్రాంతమంతా, ఒక్క ఏడాది తిరిగేసరికి, ఓ అందమైన జనపదంగా మారిపోయింది. ఆ రాజుగారు సోమశర్మ అనే వ్యక్తిని పూజారిగా నియమించారు. ఈ నియామకం వెనుక చాలా కుట్ర కొనసాగింది.

సోమశర్మ బాగా చదువుకొన్నవాడే! అతనికి పూజాదికాలు కూడా బాగా తెలుసు. అయినా రాజుగారు అతనిని పూజారిగా నియమించాలని ముందుగా అనుకోలేదు. ఆయన దృష్టిలో శంభుదాసుడనే మరో నిరుపేద బ్రాహ్మణుడున్నాడు. కానీ రాజుగారు అనుకొన్నది కొనసాగలేదు. రాజ పురోహితుడూ, రాజపత్ని కూడా ఈ విషయంలో కలుగచేసుకొన్నారు. పూజారి పదవి సోమశర్మకు లభించింది. లభించిందంటే

రాజుగారు అయిష్టంగానే తమ ఆమోద ముద్రవేశారు. శంభుదాసును అతనికి సహాయకుణ్ని గా నియమించారు.

శంభుదాసు మనస్ఫూర్తిగా ఆ పదవిని స్వీకరించాడు. కానీ సోమశర్మకు అతనంటే గిట్టకుండా ఉన్నది. వీలయినప్పుడల్లా అతన్ని చిన్నచూపు చూడటమూ, అవమానించడమూ చేస్తున్నాడు సోమశర్మ. శంభుదాసు "అంతా ఈశ్వరేచ్ఛ" అనుకొనేవాడు.

ఒకసారి గంగాతీరంలో సాధుజన సభ జరుగుతున్నది. సోమశర్మ పరోపకారాన్ని గురించి, సర్వజన సమానత్వాన్ని గురించి గంభీరోపన్యాసం చేస్తున్నాడు. తన సర్వస్వం త్యాగం చేసి అయినాసరే ఎదుటివారికి ఉపకారం చేయడం కన్నా ఈశ్వరోపాసన మరిలేదని సోమశర్మ చెబుతున్నాడు.

అంతలోనే ఓ ప్రమాదం జరిగింది. ఒక వ్యక్తి కాలుజారి గంగానదిలో పడిపోయాడు. అతగాడు "రక్షించండి – రక్షించండి" అంటూ కేకలు పెడుతున్నాడు. సోమశర్మ ఆ పడిపోయిన వానిని పైకి తీయమని శంభుదాసుకు చెప్పాడు. శంభుదాసుకు పాపం ఈతరాదు. చిత్రమేమిటంటే సోమశర్మ చెప్పక ముందే, శంభుదాసు నదిలో దూకాడు. పదినిమిషాల కల్లా, పడిపోయిన వ్యక్తిని శంభుదాసును భుజం మీద ఉంచుకొని ఒడ్డుకు చేర్చాడు. ఆ వ్యక్తి మరెవరోకాదు-మహారాజుగారే! రాజుగారికి శంభుదాసంటే ఎందుకంత గౌరవమో అప్పటికిగాని ప్రజలకు తెలియలేదు.

ఆత్మ శుద్ధిలేని ఆచారమది యేల
భాండ శుద్ధి లేని పాకమేల
చిత్తశుద్ధిలేని శివపూజ లేలరా
విశ్వదాభిరామ వినుర వేమ!

—o—